క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుట కొరకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 19న అమావాస్య సందర్భంగా దేవాలయంలో 51వ అమావాస్య హోమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

శ్రీలక్ష్మి మహా యజ్ఞానికి తరలిన భక్తులు



భట్టిప్రోలు: దేవాదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో జరగనున్న అష్టోత్తర శత కుండాత్మక (108) చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన శ్రీ లక్ష్మి మహా యజ్ఞానికి భట్టిప్రోలు నుంచి భక్తులు శుక్రవారం ఎంపీపీ లలిత కుమారి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరారు. సనాతన ధర్మ పరిరక్షణకు, సస్యశ్యామలంగా రాష్ట్రం అభివృద్ధి చెందడం కోసం మహా యజ్ఞం తలపెట్టినట్లు ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైఎస్సార్ సీపీ నాయకులు నాగమల్లేశ్వరరావు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీదేవికి లక్ష మల్లెల అర్చన



కొల్లూరు : వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని కొల్లూరు పార్వతీ దేవికి లక్ష మల్లెల అర్చన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు కొమ్మూరు వెంకట శివప్రసాద్, అనంత శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు మల్లెల అర్చన అత్యంత ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన బైబిల్ క్లాసులు



భట్టిప్రోలు: భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో గత సోమవారం నుంచి క్రైస్తవ బాల బాలికలకు నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్(సీబీసీ) క్లాసులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా గురు మండల అధ్యక్షుడు, పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చిన్ననాటి నుంచి దేవునిపై భయభక్తులు కలిగి ఉండేలా చూడాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. పాస్టరమ్మ దాసరి విజయ, సండే స్కూల్ టీచర్స్, సీబీసీ టీచర్స్ పాల్గొన్నారు. సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ సండే స్కూల్ చిల్డ్రన్స్, సంఘం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

సప్లిమెంటరీ గండం గట్టెక్కించేందుకు..

- పది పరీక్షలు తప్పిన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- వచ్చే నెల 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- అప్పటి వరకు ప్రత్యేక తరగతులతో పాఠ్యాంశాల పునశ్చరణ
- ప్రతి రోజూ పరీక్షలు, గత ప్రశ్న పత్రాల ప్రాక్టీస్
- ప్రధానోపాధ్యాయులపై బాధ్యత



జంపని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో విద్యార్థులు

వేమూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఫెయిలైన విద్యార్థులను గట్టెక్కించేందుకు పునశ్చరణ తరగతులకు శ్రీకారం చుట్టింది. పదో తరగతి పరీక్ష ఫలితాలు ఈ నెల 6న విడదలయ్యాయి. వేమూరు నియోజక వర్గంలో పదో తరగతి పరీక్షలకు 1,928 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,292 మంది ఉత్తీర్ణత సాధించారు. 636 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించలేకపోయారు. ఫరీక్ష ఫలితాల రోజునే ప్రభుత్వం పరీక్షల విభాగం సప్లిమెంటరీ పరీక్షలకు షెడ్యూలు విడదల చేసింది. వచ్చే నెల 2 నుంచి 10వరకు సప్లిమెంటరీ నిర్వహించనున్నారు.

పరీక్షలు రాసే వరకూ..

పది తరతగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. వేసవి కోర్సులు తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంది. ఇందుకు గాను అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతి రోజు సబ్జెక్టులు, పీరియడ్ల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంది. సబ్జెక్టుల వారీగా ఫెయిలైన విద్యార్థుల జాబితా తయారు చేసి, వారిని మోటివేట్ చేసి తరగతులు నిర్వహించాలి. గణితం, సైన్సు వంటి ముఖ్యమైన పాఠ్యాంశాల విషయంలో మరింత ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ప్రతి రోజూ పరీక్షలు నిర్వహించాలి. గత పబ్లిక్ పరీక్ష పేపర్లలోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయించాలి. ఈ ప్రత్యేక సమ్మర్ క్యాంపులను డిప్యూటీ, మండల విద్యాశాఖ అధికారులు ప్రతి రోజూ విజిట్ చేసి, పర్య వేక్షించాల్సి ఉంది.

ప్రణాళిక ప్రకారం తరగతులు



పది పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి రోజూ తరగతుల నిర్వహణ, పరిశీలన ఉంటుంది.

– కాజ లక్ష్మీనారాయణ, ఎంఈఓ, వేమూరు.

మోటివేట్ చేయాలి..



పదో తరగతి పరీక్షలు తప్పిన విద్యార్థులను మోటివేట్ చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుంది. సబ్జెక్టుల వారీగా.. ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను పాస్ చేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

– బద్రినారాయణ, హెచ్ఎం, జంపని పాఠశాల

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ షేక్ హజహర్ బాషా శనివారం తెలిపారు. గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలులో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హనుమజ్జయంతి వేడుకలకు సిద్ధం

భట్టిప్రోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని దేవస్థాన కమిటీ నిర్వాహకుడు మోర్ల జయ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నసంతర్పణ జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా శ్రీరామాలయ ప్రతిష్ఠా మహోత్సవం

చెరుకుపల్లి: శ్రీరామ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు గుళ్లపల్లి ఎస్టీ కాలనీలో శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7గంటలకు గణపతి పూజ, పుణ్యాహ వచన దీక్షా ధారణ, భూమి పూజ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దింటమ్మ అమ్మవారి తిరునాళ్ల రేపు

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గ్రామ దేవత పెద్దింటమ్మ కొలుపులు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారి తిరునాళ్ల నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి మహిళలు అమ్మవారి విగ్రహాలకు హారతులిచ్చి, పూజలు చేశారు. తిరునాళ్లలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం పోతురాజుస్వామి కొలుపులు నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

నేడు సమీక్షా సమావేశం

రేపల్లె రూరల్: నిజాంపట్నంలో ఈ నెల 16న నిర్వహించనున్న మత్స్యకార భరోసా కార్యక్రమంపై సమీక్షించేందుకు శనివారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు వ్యక్తిగత కార్యాలయంలో రేపల్లె మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఈ ఏడాది వంద క్వింటాళ్లు..

రాయితీపై పిల్లిపెసర, జీలుగ



పిల్లిపెసర పైరు

భట్టిప్రోలు: పచ్చిరొట్ట ఎరువుతో భూమికి ఎన్నో ప్రయోజనాలున్నాయని వ్యవసాయ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు. దీంతో రైతులు కూడా పచ్చిరొట్ట ఎరువుపై ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం కూడా 50 శాతం రాయితీపై జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలను రైతులకు అందిస్తోంది. ఈ పైర్లను పూత దశ వరకు పెంచి, భూమిలో కలియ దున్నితే భూమికి మేలు. ఆకుల్లో నత్రజని ఎక్కువగా ఉంటుంది. వేర్ల బుడిపెల్లోని నత్రజనిని గాలి ద్వారా బాగా స్థిరీకరించి భూమికి అందిస్తుంది. పచ్చిరొట్ట భూమిలో కలియదున్నాక ఏర్పడిన సేంద్రియ పదార్థంలో ఉండే పోషకాలను పీల్చుకుని పంటకు అందిస్తుంది. ఇంత మేలు కలిగించే పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు అందించేందుకు చర్యలు చేపట్టింది. గతేడాది మండలంలో అన్ని రకాల పచ్చిరొట్ట విత్తనాలు కలిపి 70 క్వింటాళ్లు విక్రయించడం జరిగింది. ఈ ఏడాది 100 క్వింటాళ్లకు ఇండెంట్ పెట్టారు. పిల్లిపెసర క్వింటా రూ.9,700లు ఉండగా 50 శాతం రాయితీపై రూ.4,850లకు, జనుము రూ.8,400లు ఉండగా రూ.4,200కు అందించనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. పచ్చిరొట్ట సాగుతో వానపాములు వృద్ధి చెంది, రైతులకు మేలు చేస్తాయని, కనీసం రెండేళ్లకోసారైనా పచ్చిరొట్ట ఎరువును పొలానికి అందించాలని భట్టిప్రోలు వ్యవసాయశాఖాధికారి గొల్లపోతు మీరయ్య తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేసుకొని, మద్దతు ధర పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతుల జాబితాను త్వరితగతిన పూర్తి చేసి, న్యాయం చేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. శుక్రవారం భట్టిప్రోలు ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం వ్యవసాయశాఖాధికారి గొల్లపోతు మీరయ్య అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు ప్రారంభమయ్యిందని, రైతులు ఆర్బీకేల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. ఏవో మీరయ్య మాట్లాడుతూ.. అకాల వర్షాలకు దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న, రంగు మారిన, మొలకెత్తిన గింజలు కలిగిన పంట దిగుబడులను అంచనా వేసి, రైతుల జాబితాను ఆర్బీకేల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన ప్రిన్సిపల్‌కు అభినందన



యేనొక్‌ను అభినందిస్తున్న బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా

రేపల్లె: ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ అందుకున్న, రేపల్లె పట్టణానికి చెందిన ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థలోని ఆర్‌సీ బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ గొరకపూడి యేనొక్ ను అభినందించారు. ఆంధ్ర లూథరన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్తేర్ సునీలా పర్యవేక్షణలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత, బోధన, పరిపాలనా విభాగంపై ఆయన పరిశోధనలకు ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాల ప్రాంగణంలో శుక్రవారం డాక్టర్ యేనొక్‌కు ఐఆర్ఈఎఫ్ విద్యాసంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా, ఆర్‌సీ కళాశాలల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జాషువా రెబ్బా, ప్రవాసాంధ్రుడు జాన్ రెబ్బా, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో సీతారామస్వామి విగ్రహాలు

రేపల్లె: టీటీడీ శ్రీ వాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని 1వ వార్డు ఎస్టీ కాలనీ శ్రీరామ్ నగర్ లో సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహ, విమాన గోపుర ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. అగ్నిహోత్రం శేషాచార్యులు ఆధ్వర్యంలో నరేంద్ర రామానుజస్వామి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సీతారాముల చరితను భక్తులకు వినిపించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త, కౌన్సిలర్లు డొక్కు వీరయ్య, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమ శంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, బొలగాని విజయలక్ష్మి, లంకా కృష్ణకుమారి, పేరం కోటేశ్వరరావు, నాయకులు వేణు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ఆవరణంలో అన్న సంతర్పణ నిర్వహించారు.

పెళ్లి మండపంలో ఆభరణాల చోరీపై కేసు నమోదు

రేపల్లెరూరల్: పెళ్లి మండపంలో గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ భరత్ వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ గ్రామానికి చెందిన కె.మహేష్ నాయుడు తన కుటుంబ సభ్యులతో బంధువు వివాహానికి హాజరయ్యేందుకు గురువారం రాత్రి రేపల్లెకు వచ్చాడు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో పెండ్లి కుమార్తె గదిలో ఉంచిన హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించారని బాధితుడు మహేష్ నాయుడు ఫిర్యాదు చేశారు. హ్యాండ్ బ్యాగ్‌లో డైమండ్ నక్లెస్, బ్రాస్‌లెట్, నల్లపూసల దండతో పాటు రూ.1.50లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపల్లె టు విజయపురిసౌత్ బస్సు సర్వీసు



సర్వీసును ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఎం

రేపల్లె రూరల్: రేపల్లె ఆర్టీసీ డిపో నుంచి పల్నాడు జిల్లా విజయపురి సౌత్‌కు నూతన బస్సు సర్వీసును ప్రారంభించినట్లు ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీఎం దేవరపల్లి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం చెప్పారు. స్థానిక డిపో ఆవరణంలో రేపల్లె-విజయపురి సౌత్ సర్వీసును ఆయన ప్రారంభించి, మాట్లాడారు. గుంటూరు, మాచర్ల మీదగా విజయపురి సౌత్‌కు ప్రతి రోజు రేపల్లె నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు చేరుకుంటుందన్నారు. విజయపురి సౌత్ నుంచి తెల్లవారు జామున 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు రేపల్లె చేరుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిప్యూటీ సూపరింటెండెంట్ మంగమ్మ, గ్యారెజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


వేడుకగా భావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవం



భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు

బాపట్ల అర్బన్: భావపురి ఇలవేల్పు వల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీర భావన్నారాయణ స్వామి 1,430వ బ్రహ్మోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలు శుక్రవారం నిర్వహించారు. ఉభయ దేవేరులతో కల్యాణం అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా సహస్ర దీపాలంకారణ ఉత్సవంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

బాపట్ల ఫొటో గ్రాఫర్‌కు జాతీయస్థాయి అవార్డు



ఫొటోగ్రాఫర్ పీవీఎస్ నాగరాజు



పతకం సాధించిన చిత్రం

బాపట్ల అర్బన్: కలకత్తాకు చెందిన మణికర్ణిక ఆర్ట్ గ్యాలరీ 2023 ఏప్రిల్ 30 నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించిన 13వ జాతీయ స్థాయి ఆన్‌లైన్ ప్రదర్శన ఫొటోగ్రఫీ పోటీల్లో బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ పీవీఎస్ నాగరాజుకు బంగారు పతకం లభించింది. నాగరాజుకు గురువారం మణికర్ణిక ఆర్ట్ గ్యాలరీ ప్రెసిడెంట్ కామినీ బాగెల్ ఈ-మెయిల్ ద్వారా ఫలితం, అభినందన తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బాపట్ల ఫొటోగ్రాఫర్స్ నాగరాజుకు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

భట్టిప్రోలు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వృద్ధుడిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరానికి చెందిన గుర్రం సుబ్బారావు(63) శుక్రవారం పని నిమిత్తం ఐలవరానికి వెళ్లి తిరిగి వస్తుండగా భట్టిప్రోలు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన సుబ్బారావును తెనాలి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మరణించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నగరం: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని శంకరరావు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు తూనుగుంట్ల జగదీష్‌కుమార్, మట్టా శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

'పది' పరీక్ష ఫలితాలపై సమీక్ష

తెనాలి: తెనాలి డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల పదో తరగతి పరీక్ష ఫలితాలపై ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం శుక్రవారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజ్, హైస్కూలులో నిర్వహించారు. తెనాలి ఉప విద్యాశాఖ అధికారిణి ఎం.నిర్మల పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందించారు. ఉత్తీర్ణతపై పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ప్రత్యేకంగా గైడ్ చేస్తూ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సెలవుల్లో కూడా వాట్సాప్ గ్రూపులతో ప్రతి టీచర్ విద్యార్థులకు అందుబాటులో ఉంటూ రాబోయే విద్యా సంవత్సరం తరగతులకు సంసిద్ధపరచాలని సూచించారు. తెనాలి మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, దుగ్గిరాల ఎంఈవో కె.శ్రీనివాసరావు, బుర్రిపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లలిత ప్రసాద్, ఈమని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు ప్రభృతులు పాల్గొన్నారు. విద్యార్థులకు హ్యాపీ హాస్పిటల్ తరపున డాక్టర్ పావని ప్రియాంక రిఫ్రెష్ మెంట్స్, బహుమతులను అందజేశారు.